ఇసుక ట్రాక్టర్ సీజ్

నిమ్మనపల్లె : బాహుదా పరీవాహక ప్రాంతం నుంచి అనుమతి లేకుడా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం సీజ్ చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ పేర్కొన్నారు. ట్రాక్టర్ యజమాని సురేష్, డ్రైవర్ శేఖర్‌లపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

బస్సు, స్కూటీ ఢీకొని ఒకరి మృతి

రాజంపేట : పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు సర్కిల్‌లో గురువారం పులివెందుల డిపోకు చెందిన బస్సు, స్కూటీ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో స్కూటీపై ఉన్న సమీరుద్దీన్ (65) మృతి చెందగా, శ్రీకాంత్ తీవ్రంగా గాయపడ్డారు. శ్రీకాంత్ రాజంపేట ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట.. అందాల మూట



ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట సొగసు చూడతరమా..



గుంజోయి.. వల విసిరి

జల జల పారుతున్న జలం.. అందులో ఈత కొడుతున్న చేపలు.. వాటిని పట్టుకోవడానికి వల వేస్తున్న మత్స్యకారులు.. ఇలాంటి సుందర దృశ్యాలు చూపరులను కట్టిపడేస్తున్నాయి. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురవడంతో.. ఆదినిమ్మాయపల్లెకు భారీగా వరదనీరు వస్తోంది. ఆనకట్ట అలుగు పారుతోంది. వెరసి అక్కడ మత్స్యకారుల సందడి నెలకొంది.

– ఫొటోగ్రాఫర్, సాక్షి, కడప



మత్స్య వయ్యారం



పడింది.. చేప



అక్కడే కటింగ్.. విక్రయం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి



మృతి చెందిన రామ్‌కుమార్



పెంచలయ్య



తీవ్రంగా గాయపడిన మల్లేష్



పోలీసులు అదుపులోకి తీసుకున్న లారీ

ఒకరికి తీవ్ర గాయాలు

అట్లూరు : బద్వేలు మండలం కొంగలవీడు గ్రామ సమీపాన గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అట్లూరు మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మృతి చెందగా, మరో వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అట్లూరు మండలం గాండ్లపల్లె గ్రామానికి చెందిన రామ్‌కుమార్ (50), పెంచలయ్య (42), నల్లగొండుగారిపల్లె కాలనీకి చెందిన మల్లేష్ ముగ్గురూ కలసి ద్విచక్ర వాహనంలో వెళుతుండగా.. బద్వేలు నుంచి మరో ద్విచక్ర వాహనంపై వస్తున్న వ్యక్తి ఢీకొనడంతో రామ్‌కుమార్, పెంచలయ్య, మల్లేషలు కిందపడిపోయారు. అదే సమయంలో బద్వేలు నుంచి కడపకు వెళుతున్న గుర్తు తెలియని లారీ రామ్‌కుమార్, పెంచలయ్యపైకి ఎక్కడంతో వారిరువురు అక్కడికక్కడే మృతి చెందారు. మల్లేష్ తీవ్ర గాయాల పాలయ్యాడు. స్థానికులు 108 వాహనానికి సమాచారం ఇవ్వడంతో తీవ్ర గాయాలపాలైన మల్లేష్‌ను బద్వేలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న బద్వేలు అర్బన్, రూరల్, అట్లూరు పోలీసులు అప్రమత్తమై అట్లూరు పోలీసుస్టేషన్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహించి, వారిపై ఎక్కి వెళ్ళిన లారీని స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. అయితే మొదటగా ఢీకొట్టిన ద్విచక్ర వాహనం ఎవరిదనే విషయమై పోలీసులు ఆరా తీస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

సీఎంను కలిసిన యానాదయ్య



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సత్కరిస్తున్న యానాదయ్య కుటుంబ సభ్యులు

కడప కార్పొరేషన్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని టీటీడీ బోర్డు సభ్యులు ఎస్.యానాదయ్యతోపాటు కుటుంబ సభ్యులు కలిశారు. గురువారం వారు తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి ముఖ్యమంత్రికి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా యానాదయ్య మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో తొలిసారి నాయీ బ్రాహ్మణులకు టీటీడీ పాలక మండలి సభ్యులుగా అవకాశం కల్పించినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

'ఆరోగ్య సురక్ష'ను విజయవంతం చేయాలి



జగనన్న సురక్ష కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం నాయకులు

కడప కార్పొరేషన్ : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం నాయకులు కృషి చేయాలని ఆ విభాగం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ అశోక్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ఐఎంఏ హాలులో వైఎస్సార్ జిల్లా వైద్య విభాగం జిల్లా అధ్యక్షులు డాక్టర్ శివానాయక్ ఆధ్వర్యంలో వైఎస్సార్, కర్నూలు, అనంతపురం, అన్నమయ్య, చిత్తూరు, నంద్యాల, సత్యసాయి జిల్లాల జోనల్ ఇన్‌చార్జిలు, జిల్లా అధ్యక్షులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఎంతోమంది ప్రాణాలు కాపాడి ప్రాణదాతగా నిలిచారన్నారు. ప్రస్తుతం ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఏవైనా సమస్యలు ఉంటే అందుకు సంబంధించిన మందులను ఉచితంగా అందజేస్తున్నారన్నారు. ఆశాలు, ఏఎన్ఎంలు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కానున్నారన్నారు. ఇందులో వైఎస్సార్ సీపీ వైద్య విభాగం సభ్యులు కూడా కీలకపాత్ర పోషించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆప్కాస్ డైరెక్టర్ డాక్టర్ కల్యాణ చక్రవర్తి, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిమూలపు సతీష్, వారణాసి ప్రతాప్‌రెడ్డి, డాక్టర్‌సొహైల్ అహ్మద్, పవన్ పాల్గొన్నారు.

బాలయ్య, దత్తపుత్రుడు ఒకటైనా ఒరిగేదేమీలేదు



మేడా మల్లికార్జునరెడ్డి

రాజంపేట : దత్తపుత్రుడు, బాలయ్య ఒకటైనా ఒరిగేదేమీ లేదని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ అనుభవం పేరుచెప్పుకొని రాజకీయాలు చేసుకొని చంద్రబాబు ఏమీ చేయలేకపోయాడని ఎద్దేవా చేశారు. అడ్డగోలుగా మోసాలకు పాల్పడి జైలు పాలయ్యారన్నారు. ఆయన అరెస్టును ప్రజలెవ్వరూ పట్టించుకోవడం లేదన్నారు. ఇందుకు ఉదాహరణే బంద్ విఫలమేనన్నారు. బాలయ్య రాకతో నారా రాజకీయానికి చరమగీతం పాడినట్లేనన్నారు. టీడీపీకి ఇప్పుడు నాయకుడు ఎవరో తెలియదని, పవన్, బాలయ్య, లోకేష్ అనేది సందిగ్ధంలో పడవేసిందన్నారు. నారా నాయకత్వంపై ప్రజల్లో నమ్మకం పోయిందన్నారు. మరోసారి తన రాజకీయ జీవితాన్ని ప్యాకేజీ కోసం పణంగా పెట్టబోతున్నాడు దత్తపుత్రుడు అని ఎద్దేవా చేశారు.

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

ఖాజీపేట : నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా అక్రమంగా బియ్యం రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ అధికారి సీఎస్‌డీటీ పీఎంవీ మనోజ్ హెచ్చరించారు. ఖాజీపేట మండలం ఏటూరు క్రాస్ సమీపంలో ఉన్న బొలెరో వాహనంను విజిలెన్స్ అధికారులు తనిఖీ నిర్వహించారు. అందులో చౌకబియ్యం ఉన్నట్లు గుర్తించి ఆదుపులోకి తీసుకున్నారు. వాహనంలో 2,900 కేజీల బియ్యం, 58 బస్తాలు ఉన్నట్లు గుర్తించారు. వాహనంతో పాటు, బియ్యంను స్వాధీనం చేసుకుని ఖాజీపేట పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఇనెస్పెక్టర్ ఈదురు బాషా, శ్రీనివాసులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలూ ముఖ్యమే

రాజుపాళెం : చదువుతో పాటు క్రీడలు ముఖ్యమేనని ఎంఈఓ క్రిష్టఫర్ పేర్కొన్నారు. రాజుపాళెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం హెచ్ఎం వేలంగ్‌కుమార్, పీడీ వెంకటసుబ్బయ్య అధ్యక్షతన మండల స్థాయి స్కూల్ గేమ్స్ టోర్నమెంట్ కం సెలక్షన్స్ ఎంపికలను ఎంఈఓలు క్రిష్టఫర్, రామస్వామి రెడ్డి, హెచ్ఎం వేలంగ్ కుమార్, మాజీ సర్పంచ్ బీవీ కృష్ణారెడ్డి ప్రారంభించారు. 15 ఏళ్ల పైబడి విద్యార్థుల కేటగిరీల్లో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, టెన్నిస్, బాల్ బాట్మింటన్, టేబుల్ టెన్నీస్, బాడ్మింటన్, హ్యాండ్‌బాల్, పుట్‌బాల్, అథ్లెటిక్స్ క్రీడాంశాల్లో ఎంపికలు చేశారు.

క్రీడలతో మానసికోల్లాసం

ఖాజీపేట : క్రీడల్లో పాల్గొనడం వల్ల విద్యార్థుల్లో శారీరక వ్యాయామంతో పాటు మానసిక ధృడత్వం పెరుగుతుందని ఏపీఐఐసీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి అన్నారు. మోడల్ స్కూల్‌లో మండలంలో క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. క్రీడల్లో పాల్గొనే విద్యార్థులను పరిచయం చేసుకుని వారికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతో పాటు మానసికోల్లాసం అవసరమన్నారు. ఎంఈఓ స్వర్ణలత, మండలంలోని పీఈటీలు పాల్గొన్నారు.

16న మున్సిపల్ కార్యాలయ భవనం ప్రారంభం



మైదుకూరు : మైదుకూరు మున్సిపాలిటీ కార్యాలయ నూతన భవనం ప్రారంభోత్సవం ఈనెల 16న నిర్వహించనున్నారు. స్థానిక తెలుగు గంగ కాలనీలో రూ.2.50 కోట్లతో నిర్మించిన ఈ భవనాన్ని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర మున్సిపల్‌శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ ప్రారంభించనున్నారు. పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొననున్నారు.

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు

బద్వేలు అర్బన్ : కష్టపడి చదివే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అర్బన్ సీఐ పి.యుగంధర్ పేర్కొన్నారు. స్థానిక అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో వివిధ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానిని సాధించేందుకు అహర్నిశలు శ్రమించాలని కోరారు. అనంతరం గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, దిశా చట్టం, బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ సునీత, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

మండల అథ్లెటిక్స్ ఎంపికలు పూర్తి

అట్లూరు : స్థానిక అట్లూరు కూడలిలోని విశాల క్రీడా మైదానంలో గురువారం జిల్లా పాఠశాలల క్రీడల సమాఖ్య అట్లూరు మండల స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో అథ్లెటిక్స్, జంప్స్, త్రోస్, రన్స్‌లలో 14, 17 సంవత్సరాల బాలబాలికల ఎంపికలు నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారులు బద్వేలు నియోజకవర్గ స్థాయి ఎంపికలకు అర్హులవుతారని మండల స్కూల్ గేమ్స్ కన్వీనర్ రమేష్‌యాదవ్ తెలిపారు.

జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక



క్రీడాకారులతో మాట్లాడుతున్న జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ క్రీడా పాఠశాలలో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి సీనియర్ విభాగం ఫుట్‌బాల్ ఎంపికలు ఉత్సాహంగా సాగాయి. ఈ ఎంపికలకు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కె.థామస్, కార్యదర్శి ఎం.సుధీర్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు ఈ నెల 16వ తేదీన సత్యసాయి జిల్లా కదిరిలో నిర్వహించే జోనల్ పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. అనంతరం ఎంపికలు నిర్వహించి జిల్లా జట్లను ప్రకటించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫుట్‌బాల్ కోచ్ హరి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు : కె.సి.మైఖెల్ జాన్సన్, వై.సునీల్‌కుమార్, సి.హెచ్.వరకుమార్, బి.రంగస్వామి, ఎస్.ముక్తియార్, ఎస్.కె.గైబు, బి.సునీత్, బి.జె.వెస్లీ, పరమేష్, కె.సంజు, జె.బన్నీ, ఎస్.బాషా, ఎం.రాఘవేంద్ర, వి.జె.బ్రెట్లీ, కె.హరీష్, ఎస్.కె.మహమ్మద్, ఎస్.బాలాజీ, వై.కృష్ణ, బి.పూజిత్, ప్రకాష్, సి.వెంకటశివ, వి.సలీంరాజు.

ట్యాంకర్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

త్రుటిలో తప్పిన ప్రమాదం



దెబ్బతిన్న బస్సు ముందు భాగం

గోపవరం : మండలంలోని పి.పి.కుంట సమీపంలో నెల్లూరు – ముంబై జాతీయ రహదారి (ఎన్‌హెచ్-67)పై గురువారం తెల్లవారుజామున ముందు వెళుతున్న ట్యాంకర్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. త్రుటిలో ప్రమాదం తప్పింది. బెంగుళూరు నుంచి పామూరుకు వెళుతున్న ఉదయగిరి డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సు.. ముందు వెళుతున్న ఆయిల్ ట్యాంకర్ సడన్‌గా బ్రేక్ వేయడంతో వెనుకనే వెళుతున్న బస్సు ఆయిల్ ట్యాంకర్‌ను ఒక్కసారిగా ఢీకొట్టింది. దీంతో బస్సు ముందుభాగం దెబ్బతింది. ట్యాంకర్ వెనుకభాగం కూడా నుజ్జునుజ్జు అయింది. బస్సుడ్రైవర్ వెనుక సీటులో ఉన్న ఇద్దరు ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. మిగిలిన ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే బస్సులో ఉన్న ప్రయాణికులను మరో బస్సు ద్వారా గమ్యస్థానం చేర్చారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ సమైక్యతకు ప్రతీక హిందీ

బద్వేలు అర్బన్ : విభిన్న భాషల సమాహారంగా ఉన్న భారతదేశంలో జాతీయ సమైక్యతకు ప్రతీకగా హిందీ కొనసాగుతుందని చిన్నకేశంపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.ఉమాకాంత్ పేర్కొన్నారు. హిందీ దివస్ సందర్భంగా గురువారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు మాతృభాష తర్వాత హిందీభాష పట్ల మక్కువ పెంచుకోవాలని పిలుపునిచ్చారు. పాఠశాల స్టాఫ్ సెక్రటరీ మాదనవి జయకుమార్, హిందీభాషోపాధ్యాయులు గౌస్ బాష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా హిందీభాష దినోత్సవ వేడుకలు

కలసపాడు : స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం హిందీభాష దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు మెర్సీమాలిని హిందీ భాష గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు సుమన్, హిందీ ఉపాధ్యాయుడు జోగారావు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం

చాపాడు: మండల పరిధిలోని అయ్యవారిపల్లె గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జాతీయ హిందీ భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రధానోపాధ్యాయులు గుర్రప్ప మాట్లాడుతూ జాతీయ అనుసంధాన భాషగా హిందీ దేశ ప్రజలందరికీ ఉపయుక్తమన్నారు. హిందీ ఉపాధ్యాయులు సుశీల ఆధ్వర్యంలో నిర్వహించిన పలు పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

క్లుప్తంగా

కస్తూర్బా విద్యార్థిని ప్రతిభ

అట్లూరు: అట్లూరు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థిని రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలకు ఎంపిక అయినట్లు ఆ పాఠశాల స్పెషలాఫీసర్ ఫణిశ్రీ, పీఈటీ అధ్యాపకురాలు ప్రమీళా పేర్కొన్నారు. పదో తరగతి చదువుతున్న పి.హారిక అండర్–17 విభాగంలో విజయవాడలోని ఈనెల 21, 22, 23 తేదీల్లో జరిగే కుస్తీ పోటీలలో పాల్గొంటుందని ఆమె పేర్కొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు నియోజకవర్గ పరిధిలోని ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ మల్లికార్జున రెడ్డి తెలిపారు. ప్రయాణికులు మధ్యాహ్నం 12 నుంచి 1 గంట వరకు 9959225777కు ఫోన్ చేయాలని కోరారు.

16న మహా జనసభ

ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు సెంట్రల్ కన్స్యూమర్ కో–ఆపరేటివ్ స్టోర్స్ మహా జన సభను ఈనెల 16 ఉదయం 11 గంటలకు స్టోర్స్ ఆవరణలో నిర్వహించనున్నట్లు అధ్యక్షురాలు గజ్జల కళావతి ఒక ప్రకటనలో తెలిపారు. సభకు స్టోర్స్ పాలకవర్గ సభ్యులు, సభ్యులు హాజరుకావాలని కోరారు.

సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా

ప్రొద్దుటూరు : సీపీఐ ఆధ్వర్యంలో గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య, పట్టణ కార్యదర్శి పి.సుబ్బరాయుడు మాట్లాడుతూ కొత్తపల్లె గ్రామ పంచాయతీ సుందరయ్య కాలనీ పరిధిలో పేదల భూములు అన్యాక్రాంతమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. ధర్నాలో సీపీఐ నాయకులు షరీఫ్, హరి, శివారెడ్డి, మద్దిలేటి పాల్గొన్నారు.

రేపు వరి ధాన్యం వేలం పాట

చాపాడు: గ్రామీణ విత్తన ఉత్పత్తి పథకం ద్వారా ఖరీఫ్ సీజన్‌లో రైతులకు పంపిణీ చేసే ఒందుకు సిద్ధంగా ఉంచిన ఎన్‌డీఎల్‌ఆర్–7 రకం ధాన్యాన్ని శనివారం వేలం పాట నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి మ్యాగీ తెలిపారు. ఆసక్తి కలిగిన వ్యాపారులు, రైతులు చాపాడులోని రైతు భరోసా కేంద్రం వద్ద నిర్వహించే బహిరంగ వేలంలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

ఏపీటీఎఫ్ కార్యకర్తల సమావేశం

కలసపాడు: మండలంలోని ఎగువ రామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఏపీటీఎఫ్ (257) కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ సీపీఎస్‌తో పాటు జీవో నెంబర్ 117ను రద్దు చేయాలని కోరారు. ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి జీ.రాంభూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పండుగ చేసుకుందాం



సమావేశంలో మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ యుగంధర్

ప్రొద్దుటూరు క్రైం: వినాయక చవితి పండుగ సందర్భంగా గణేష్ విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ప్రొద్దుటూరు సీఐలు తెలిపారు. పట్టణంలోని గణేష్ ఉత్సవ కమిటి సభ్యులతో గురువారం సాయంత్రం టూ టౌన్, త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐలు పలు సూచనలు చేశారు. వినాయకచవితి ఉత్సవాలు ప్రశాంతంగా జరగడానికి అందరూ సహకరించాలని కోరారు. సీఐలు రాజారెడ్డి, ఇబ్రహీం, నారాయణయాదవ్, యుగంధర్, రమణారెడ్డి పాల్గొన్నారు.

రాజుపాళెం: వినాయక చవితి పండుగను ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ప్రొద్దుటూరు రూరల్ సీఐ రమణారెడ్డి పేర్కొన్నారు. రాజుపాళెంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో గురువారం సాయంత్రం మండలంలోని వినాయక కమిటీ సభ్యులతో, ప్రజలతో నిర్వహించిన పీస్ కమిటీ సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. ఎస్‌ఐ రాజగోపాల్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పండుగ చేసుకుందాం

చాపాడు: వినాయక చవితి పండుగను ప్రశాంత వాతావరణంలో భక్తిభావంతో నిర్వహించుకుందామని తహసీల్దారు సుభానీ పేర్కొన్నారు. స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో గురువారం సాయంత్రం వినాయక చవితి ఉత్సవ నిర్వహణపై ఉత్సవ కమిటీ సభ్యులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఎస్‌ఐ మైనుద్దీన్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

ఖాజీపేట : వినాయక చవితి పండుగ పురస్కరించుకుని విగ్రహాలు ఏర్పాటు చేసుకునేందుకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఖాజీపేట ఎస్‌ఐ కుళ్లాయప్ప ఉత్సవ కమిటీలకు సూచించారు. ఉత్సవ కమిటీలు విగ్రహం ఏర్పాటు చేసే ప్రదేశం.. నిమజ్జన తేదీ... మైక్ ఏర్పాటుకు చలానా కట్టి అనుమతులు తీసుకోవాలని సూచించారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దాం

బద్వేలు అర్బన్: మట్టి వినాయకుడిని పూజించి పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరు కృషి చేయాలని అర్బన్ సీఐ యుగంధర్ పేర్కొన్నారు. డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో రూపొందించిన మట్టి వినాయకుడిని పూజిద్దాం – పర్యావరణాన్ని కాపాడదాం పోస్టర్లను గురువారం ఆయన విడుదల చేశారు.

17న మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

ప్రొద్దుటూరు కల్చరల్ : వినాయక చవితి సందర్భంగా ఈ నెల 17న సాయంత్రం 4.30 గంటలకు విజయకుమార్ హాల్ సమీపంలో మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు పసుపుల వెంకటమ్మ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు పసుపుల సుబ్బరాయుడు తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జేడీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జేడీ లక్ష్మినారాయణ సహకారంతో పర్యావరణ పరిరక్షణలో భాగంగా రూ.30వేల వ్యయంతో వెయ్యి మట్టివిగ్రహాలను పంపిణీ చేస్తున్నామన్నారు.

పింఛన్.. నాడు టెన్షన్.. నేడు ఠంచన్

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



కొత్త పింఛన్ల లబ్ధిదారులతో ఎమ్మెల్యే

ప్రొద్దుటూరు : చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో వృద్ధులు పింఛన్ తీసుకోవాలంటే 70 ఏళ్ల వయసు వచ్చేదని.. నేడు జగన్ ప్రభుత్వంలో 60 ఏళ్లకే పింఛన్ తీసుకుంటున్నారని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. పైగా నేడు ఎలాంటి టెన్షన్ లేకుండా ప్రతి నెలా ఠంచన్‌గా పింఛన్ అందుకుంటున్నారన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 27వ వార్డుకు సంబంధించి 29వ సచివాలయంలో కొత్తగా మంజూరైన 20 పింఛన్లను గురువారం ఎమ్మెల్యే పంపిణీ చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి ప్రాతినిథ్యం వహిస్తున్న ఈ వార్డులో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై అందజేశారు. మున్సిపాలిటీకి సంబంధించి మొత్తం 383 పింఛన్లు కొత్తగా మంజూరయ్యాయని తెలిపారు. 27వ వార్డులో ప్రస్తుతం పింఛన్ల సంఖ్య 450కి పెరిగిందన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డితోపాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కొత్త పింఛన్ల మంజూరుతో పేదలకు ఊరట

ప్రొద్దుటూరు : మున్సిపాలిటీ పరిధిలోని 38, 40, 41వ సచివాలయాల పరిధిలో కొత్తగా మంజూరైన పింఛన్లను గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీదేవి నాగరాజు పంపిణీ చేశారు. 39వ వార్డు కౌన్సిలర్ చింపిరి అనిల్ కుమార్ పాల్గొన్నారు.

– 13వ వార్డు కౌన్సిలర్ సికిలిగిరి ఇర్ఫాన్ బాషా 14, 15 సచివాయాల్లో కొత్తగా మంజూరైన పింఛన్లను మంజూరు చేశారు.

– 7వ సచివాలయంలో నూతనంగా మంజూరైన పింఛన్లను గురువారం పంపిణీ చేశారు. కౌన్సిలర్ రాగుల శాంతి పాల్గొన్నారు.

కొత్త పింఛన్ల పంపిణీ

పోరుమామిళ్ల: పోరుమామిళ్ల, కవలకుంట్ల పంచాయతీల్లో కొత్తగా మంజూరయిన పెన్షన్లను గురువారం వైస్ ఎంపీపీలు, జెడ్పీటీసీలు లబ్ధిదారులకు అందజేశారు. పోరుమామిళ్ల నాలుగు సచివాలయాల పరిధిలో 106 మంది వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు మంజూరయిన పెన్షన్లను వైఎస్ ఎంపీపీ–1 సీయం బాష, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజీవ్‌బాషా లబ్ధిదారులకు అందచేశారు. మండల కో–ఆప్షన్ మెంబర్ అల్లా, ఎంపీటీసీలు ఇస్సాక్, గురప్ప, ముర్తుజా, పార్టీ పట్టణ నాయకుడు హబీబ్, పంచాయతీ కార్యదర్శి సుబ్బారావు పాల్గొన్నారు. కవలకుంట్ల పంచాయతీలో 21 మందికి పెన్షన్లు మంజూరు కాగా గురువారం జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీ–2 చెన్ను రాజశేఖర్, సర్పంచ్ సావిత్రి అందచేశారు.

ప్రజల చెంతకే పాలన



మండల పరిషత్ కార్యాలయం ఆవరణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, ఆర్డీఓ

మైదుకూరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమంతో ప్రజల వద్దకే పాలన వచ్చినట్లైందని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. మైదుకూరులో శుక్రవారం నిర్వహించనున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై గురువారం బద్వేలు ఆర్డీఓ ఆకుల వెంకటరమణతో కలసి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రఘురామిరెడ్డి మాట్లాడుతూ ప్రజల వద్దకు పాలన గురించి గతంలో విన్నామని, ఇప్పుడు ప్రత్యక్షంగా జగనన్నకు చెబుదాం కార్యక్రమంతో చూస్తున్నామని అన్నారు. మైదుకూరులో శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉదయం 8 గంటల నుంచి ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ సహా జిల్లా స్థాయి అధికారులు పాల్గొనే ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజలు అర్జీల రూపంలో తెలిపే సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తారని పేర్కొన్నారు. కొన్నింటిని జిల్లా స్థాయి అధికారులు విచారించి పరిష్కరిస్తారని తెలిపారు. ఆర్డీఓ ఆకుల వెంకటరమణ మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు ప్రజా సమస్యలను పరిష్కరించడం కోసమే జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించే మండల పరిషత్ కార్యాలయం ఆవరణాన్ని పరిశీలించి ఏర్పాట్లపై తగు సూచనలు ఇచ్చారు.

జగనన్న కాలనీ సందర్శన

దువ్వూరు : పుల్లారెడ్డిపేటలో నిర్మిస్తున్న జగనన్న కాలనీని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘు రామిరెడ్డి పరిశీలించారు. కాలనీలో నిర్మిస్తున్న ఇళ్ల ను పరిశీలించి ఎమ్మెల్యే అధికారులకు పలు సూచన లు చేశారు. త్వరలో జగనన్న కాలనీలో గృహ ప్రవేశాలు చేపడుతామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖ సలహాదారుడు తిరుపాల్‌రెడ్డి, ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, హౌసింగ్ డీఈ పాల్గొన్నారు.

నేడు గడపగడపకు మన ప్రభుత్వం...

దువ్వూరు : మండలంలోని చింతకుంట సచివాలయం–2 పరిధిలోని మీర్జఖాన్‌పల్లె, సంగటితిమ్మాయపల్లె, అరుంధనగర్ గ్రామాల్లో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిచంనున్నట్లు ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి తెలిపారు.

సమస్యలపై దృష్టి సారించండి



మాట్లాడుతున్న ఎంపీపీ జయచంద్రారెడ్డి

దువ్వూరు : ప్రజా సమస్యలపై అధికారులు దృష్టి సారించాలని మండల పరిషత్ అధ్యక్షుడు జయచంద్రారెడ్డి తెలిపారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో విద్యుత్, తాగునీరు, రైతుల సమస్యలపై దృష్టి సారించాలని, జగనన్న గృహాలు సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు ఎంపీపీ సూచించారు. మండల వ్యవసాయాధికారి అమరనాథ్‌రెడ్డితో పాటు మిగతా శాఖల అధికారులు, వారి శాఖ ల అభివృద్ధికిపై సమావేశంలో సభ్యులకు చదివి వినిపించారు. జెడ్పీటీసీ కృష్ణయ్య, వైస్ ఎంపీపీ రహమతున్నీసా, ఎంపీడీఓ జగదీశ్వరరెడ్డి పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షను విజయవంతం చేద్దాం

ప్రొద్దుటూరు : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ సభాభవనంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై సచివాలయాల అడ్మిన్, హెల్త్ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈనెల 15 నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి శివప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్యాధికారులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు క్రైం : మండలంలోని కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై డాక్టర్ హనీఫ్‌బాబా ఆధ్వర్యంలో గురువారం సమావేశాన్ని నిర్వహించారు. మహిళా ఆరోగ్య కార్యకర్తలు, సీహెచ్‌ఓలు, యంఎల్‌హెచ్‌పీలకు ఆరోగ్య సురక్ష కార్యక్రమం గురించి డాక్టర్ శ్రీనివాస్ వివరించారు. సీహెచ్‌ఓ కృష్ణమ్మ, హెచ్‌ఈ శోభారాణి, సూపర్‌వైజర్లు బీఏ వరప్రసాద్, చంద్రకళ, ఆరోగ్య కార్యకర్తలు, సీహెచ్‌ఓలు, ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి ఆరోగ్య సురక్ష..

కలసపాడు : మండలంలో శుక్రవారం నుంచి ఈ నెల 30వ తేదీ వరకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా క్యాంపెయిన్ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మహబూబ్‌బీ తెలిపారు. ఈ నెల 30 నుంచి అక్టోబర్ 12వ తేదీ వరకు గ్రామాల్లో హెల్త్ క్యాంపులు నిర్వహిస్తారని, ఈ క్యాంపులను ఎంపీడీఓ, తహసీల్దార్లు పర్యవేక్షిస్తారని తెలిపారు.

ఆయుష్మాన్ భవపై ర్యాలీ

బి.కోడూరు : బి.కోడూరులో గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయుష్మాన్ భవ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం ఏఎన్‌ఎం, ఆశావర్కర్లతో నిర్వహించిన సమీక్షలో వైద్యాధికారి మాట్లాడుతూ ఆయుష్మాన్ భవ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 20 నుంచి 27 వరకు హెల్త్‌క్లినిక్, ఆరోగ్య కేంద్రాల్లో హెల్త్ మేళాలు నిర్వహించనున్నారన్నారు. సీహెచ్‌ఓ నాగమణి పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం



గంగనపల్లెలో మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

కాశినాయన : పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. గురువారం మండలంలోని గంగనపల్లె గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల వలన కలిగిన లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ముజఫర్‌రహీమ్, సచివాలయాల మండల కన్వీనర్ హనుమంతరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు చెన్నకృష్ణారెడ్డి, కుళాయిరెడ్డి, రామిరెడ్డి, వెంకటరెడ్డి, దశరథరామిరెడ్డి పాల్గొన్నారు.